AKSHARA TODAY

అక్షరటుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

29-10-2026 (Thursday)

MAIN EDITION

ఉద్యోగులకు అమెజాన్ షాక్



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : అమెజాన్ మరో 250 మందిని తొలగించింది. ఈ మేరకు వారికి మెయిల్ ద్వారా తెలియజేసింది. బుధవారం తన డివైసెస్, సర్వీసెస్ విభాగంలో సుమారు 250 ఉద్యోగాలను తొలగించింది. ప్రధానంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విభాగంలో ఈ కోతలు జరిగాయి. కంపెనీ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి, మా ఉత్పత్తి రోడ్‌మ్యాప్‌కు అనుగుణంగా మెరుగ్గా పనిచేయడానికి ఉద్యోగుల తొలగింపు నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీకి చెందిన ఓ ప్రతినిధి తెలిపారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్



అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నవంబర్‌లో 1,395 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. ఈ మేరకు కసరత్తు చేస్తోంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఎక్కువ ఖాళీలు ఉన్నాయి. ఇంటర్ పాసైన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

మోదీకి మీడియా ఫోబియా : పీసీసీ చీఫ్



అక్షరటుడే, హైదరాబాద్ : ప్రధాని మోదీకి మీడియా ఫోబియా ఉందని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. జర్నలిస్టులను ఫేస్ చేసే ధైర్యం మోదీ చేయర న్నారు. రాజకీయాల్లో ఎన్ని గెలిచామన్నది ముఖ్యం కాదరని, ఎక్కడ గెలిచామన్నది ముఖ్యమన్నారు. బీజేపీ హెడ్ క్వార్టర్స్ లో నాగపూర్ లో గెలిచి సత్తా చూపించామన్నారు.

పడిపోయిన గూగుల్ షేర్లు..



అక్షరటుడే, నేషనల్ డెస్క్: అంతర్జాతీయ టెక్ దిగ్గజం గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ మూడో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ఇవి వాల్‌స్ట్రీట్ అంచనాలను అందుకోలేకపోయాయి. ఫలితంగా బుధవారం అమెరికా మార్కెట్లలో ఆల్ఫాబెట్ షేర్లు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్నాయి.

ఇంటికే రైల్వే పార్సిల్ సేవలు..



అక్షరటుడే, ఢిల్లీ : వినియోగదారులకు మరింత సులువైన, వేగవంతమైన సేవలందించేందుకు భారతీయ రైల్వేస్ ఓ అద్భుతమైన నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. 'ఫర్ సే ఫర్ తక్' పేరిట నేరుగా కస్టమర్ల ఇంటి వద్దకే వచ్చి పార్సిళ్లను స్వీకరించి, గమ్యస్థానాల కు చేర్చే 'డోర్-టు-డోర్' పార్సిల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది.

నాగ్‌పూర్‌లో గెలిచిన కాంగ్రెస్

అక్షరటుడే, మహారాష్ట్ర : నాలుగు రాష్ట్రాల్లోని 28 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా కాంగ్రెస్ ఒక సీటు గెలుపొందింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదని ప్రధాని మోదీ బుధవారం ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. తుది ఫలితాలు వెలువడక ముందే ఆయన పోస్ట్ చేశారు. అనంతరం ఫలితాల్లో కాంగ్రెస్ ఒక సీటు గెలుపొంది పరువు కాపాడుకుంది.



యూపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

అక్షరటుడే, యూపీ : ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాలన మార్పు పేరిట హింసాత్మక నిరసనలు చేపడుతున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలు రాకుండా చూడాలని నిర్ణయించింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వ్యక్తిత్వ ధృవీకరణ నిబంధనలను యోగి సర్కార్ కఠినతరం చేసింది. పాలన మార్పు లక్ష్యంతో హింసాత్మక కార్యకలాపాల్లో పాల్గొన్న వ్యక్తులను ప్రభుత్వ ఉద్యోగాల నుండి దూరంగా ఉంచవచ్చని పేర్కొంది. అయితే రాజకీయ భావజాలం ఆధారంగా ఏ అభ్యర్థినీ అనర్హులుగా ప్రకటించలేమని స్పష్టం చేసింది.



మాజీ మంత్రి కొండా సురేఖ యూ టర్న్ తీసుకున్నారు. గతంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు. ఎక్స్ వేదికగా ఆయనకు క్షమాపణలు తెలిపారు. తాను ఉద్దేశపూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదని వివరణ ఇచ్చారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆమె పోస్ట్ ప్రస్తుతం తీవ్ర చర్చకు దారి తీసింది.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

సారీ చెప్పిన కొండా సురేఖ

■ కేటీఆర్‌కు క్షమాపణ చెబుతూ పోస్ట్ ■ ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదని వివరణ ■ రాజకీయ వర్గాల్లో చర్చ

మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె పోస్ట్ చేశారు. సురేఖ గతంలో కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఆయనపై ఆరోపణలు చేశారు. ఆ సమయంలో ఆమె వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అయితే తాజాగా వాటిపై ఆమె వివరణ ఇవ్వడం గమనార్హం. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో తాను ఆ వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా చేయలేదన్నారు.

వెనక్కి తీసుకుంటున్నా

ఆ సమయంలో తాను కొన్ని నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందని సురేఖ అన్నారు. కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులను బాధపెట్టాలని గానీ, వారి ప్రతిష్టకు భంగం కలిగించాలనే దురుద్దేశం తనకు లేవన్నారు. వ్యాఖ్యలు వారి కుటుంబ సభ్యులను నొప్పించి ఉంటే అందుకు చింతిస్తూ, ఉపసంహరించుకుంటున్నానని పేర్కొన్నారు.

పార్టీ మారతారా..

కొండా సురేఖ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే మంత్రి అయ్యారు. అనంతరం ఆమె తరచు వివాదాల్లో నిలిచారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కొండా దంపతులకు మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సురేఖ కూతురు కొండా సుష్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో అధిష్టానం సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించింది. సెప్టెంబర్ 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొండా సురేఖను మంత్రివర్గం నుండి తొలగించాలని గవర్నర్ కు సిఫారసు చేశారు. గవర్నర్ వెంటనే ఆమోదించారు. అప్పటి నుంచి కాంగ్రెస్‌లోనే ఉన్న ఆమె తాజాగా.. కేటీఆర్‌కు క్షమాపణ చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తున్నాయి. ఆమె మళ్లీ గులాబీ గూటికి వస్తారా అని పలువురు చర్చించుకుంటున్నారు.

బంగాళాఖాతంలో మరో డేంజర్..!



అక్షరటుడే, ఏపీ: అర్నబ్ తుఫాన్‌తో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే అతలాకుతలమైంది. ఎక్కడికక్కడ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పలు ప్రాంతాలు జలమయమై, పంట పొలాలు నీట మునగడంతో ఉత్తరాంధ్ర చిగురుటాకులా వణికింది. దీని తీవ్రత పూర్తిగా తగ్గకముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దక్షిణ అండమాన్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఇది ఏర్పడినట్లు గుర్తించారు. మరో 24 గంటల్లో ఇది పశ్చిమవాయవ్య దిశగా కదిలి వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది.

పీఎన్‌బీలో రూ.35 కోట్లు మాయం



అక్షరటుడే, ఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ గ్రేటర్ నోయిడా ఐచ్చర్ శాఖలో రూ.35 కోట్ల భారీ స్కామ్ వెలుగుచూసింది. తమ ఖాతాల్లో డబ్బులు డ్రా చేయడానికి లేదా బ్యాలెన్స్ చెక్ చేయడానికి వెళ్లిన వినియోగదారులకు అకౌంట్లు ఖాళీగా కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. సేవింగ్స్ అకౌంట్లతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లను కూడా ప్రీమెచ్యూర్ చేసి నగదు మళ్లించినట్లు గుర్తించారు. ఈ కుంభకోణంలో ప్రధానంగా జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఇతర భూసేకరణ ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందిన రైతులు, సాధారణ ప్రజల ఖాతాలనే లక్ష్యంగా చేసుకున్నారు. విచారణ చేపట్టిన బ్యాంక్ అధికారులు మేనేజర్ సహా ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఆరేళ్లలో రూ. 6,500 కోట్లకు పెరిగిన సంపద

అక్షరటుడే, బిజినెస్‌డెస్క్ : భారత టెలికాం రంగంలో ప్రముఖ పారిశ్రామిక వేత్తల్లో ఒకరైన మహేంద్ర నహతా.. హెచ్ ఎఫ్ సీఎల్ కంపెనీ వ్యవస్థాపకుల్లో ఒకరు. కోల్‌కతాకు చెందినన ఈయన కుటుంబం జియో ప్లాట్‌ఫామ్స్‌లో పెట్టిన పెట్టుబడికి ఏకంగా 136 రెట్ల లాభాలు వచ్చాయి. ఆరేళ్ల క్రితం ఆయన కుటుంబానికి ఒక్కో షేరును రూ. 10చొప్పున 4.787 కోట్ల షేర్లు కేటాయించారు. అంటే రూ. 47.87 కోట్లు పెట్టుబడి పెట్టారు. కంపెనీ షేరు ధర బుధవారం లిస్టింగ్ సమయంలో రూ. 1,358 గా ఉంది. దీంతో నహతా ఫ్యామిలీ సంపద ఆరేళ్లలో రూ. 6,450 కోట్లకుపైగా పెరిగింది.



'ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేస్తున్న మంత్రి'



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని టామ్‌కామ్ పేరిట మంత్రి వివేక్ వెంకట్ స్వామి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జర్మనీలో ఉద్యోగాల కోసం 200 మంది నుంచి రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేశారన్నారు. 10 మందిని కూడా అక్కడికి పంపించలేదన్నారు. ఓ యువకుడికి మెకాట్రానిక్స్ విభాగంలో ఉద్యోగం అని చెప్పి పంపించారని, తీరా అక్కడకు వెళ్లాక.. బీఫ్, మటన్, ఇతర మాంసం కట్ చేయాలని చెప్పారన్నారు.

రేషన్ బియ్యం పాలిష్ చేసి.. కిలో రూ.80కి విక్రయం



అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని కార్మాన్‌ఘాట్‌లోని బియ్యం డిపోలపై పౌర సరఫరా, విజిలెన్స్ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి, ప్రముఖ కంపెనీల బ్రాండ్ పేర్లతో బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 80 నుండి రూ. 100 వరకు విక్రయిస్తున్న మాఫియా గుట్టును అధికారులు రట్టు చేశారు. పలు దుకాణాల నుండి బియ్యం నమూనాలను సేకరించారు. అధికారులు తనిఖీలకు రాగానే.. చాలా మంది దుకాణదారులు తమ దుకాణాలను మూసివేసి అక్కడి నుండి పరారయ్యారు.

ఆన్‌లైన్ మెడికల్ స్టోర్‌లపై దాడులు



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : రాష్ట్రంలోని ఆన్‌లైన్ ఫార్మసీ నెట్‌వర్క్‌లపై టీజీ సేఫ్ అధికారులు గురువారం దాడులు చేశారు. టాటా 1mg, నెట్‌మెడ్స్, జెప్టో, అపోలో 24/7, మెడ్‌ప్లస్ మార్ట్, ఇన్‌స్టామార్ట్‌లకు అనుబంధంగా ఉన్న 106 మెడికల్ షాపులలో తనిఖీలు చేశారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మడం, బిల్లులు, కొనుగోలు రసీదులు, షెడ్యూల్ H1 రిజిస్టర్లలో లోపాలు, అర్హత కలిగిన ఫార్మసిస్ట్ పర్యవేక్షణ లేకుండా మందులు పంపిణీ చేసినందుకు 32 షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

డంపింగ్ యార్డ్ తొలగించే వరకు పోరాటం : ఎంపీ ఈటల

అక్షరటుడే, మల్కాజ్‌గిరి : మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లాలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తొలగించే వరకు తన పోరాటం ఆగదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కీసరలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జవహర్‌నగర్ వాసులకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించలేకపోతుందని విమర్శించారు. డంపింగ్ యార్డు తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ తయారు చేస్తే నిధులు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. రూ.రెండువేల కోట్లు పెట్టి డంపింగ్ యార్డ్ తొలగించలేని సీఎం.. రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి మూసి ప్రక్షాళన ఎలా చేస్తారన్నారు.

